నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I హైదరాబాద్, శుక్రవారం 10 జనవరి 2025 RANGAREDDY

మండలంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేస్తున్న అధికారులు

# ఇండ్లు దక్కేనా..?

- ఆందోళనలో దరఖాస్తుదారులు
- ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న ఇండ్లు ఉన్నవారు
- ఇప్పటికే మొదలైన పైరవీలు
- రంగారెడ్డి జిల్లాలో వచ్చిన అప్లికేషన్లు 3,75,013

ఇప్పటివరకు 96% ఇండ్ల సర్వే పూర్తి

ఇందిరమ్మ ఇండ్ల కోసం హౌస్ ఉన్న వారు కూడా దరఖాస్తు చేసుకోవడంతో తమకు ఇండ్లు వచ్చేనా ..? అని నిరుపేదలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలను వేసి అర్హులను గుర్తించేందుకు ఇండ్ల సర్వేను చేపట్టింది. ఒకవైపు ఇండ్ల సర్వే జరుగుతుండగానే మరోవైపు చోటామోటా నాయకులు ఇండ్ల కోసం పైరవీలను మొదలెట్టారు. కాగా జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల కోసం 3,75,013 దరఖాస్తులు రాగా.. ఇప్పటివరకు 3,60,000(96%) ఇండ్ల సర్వే పూర్తైంది. కాగా రేవంత్ సర్కారు నియోజకవర్గానికి 3500 ఇండ్లు కేటాయించడంతో తమకు ఇండ్లు వస్తాయో.. రావోనని నిరుపేద లు కలవరపడుతున్నారు. -షాబాద్, జనవరి 9

ఇందిరమ్మ ఇండ్ల పథకంలో నిరుపేదలకు ఇండ్లు దక్కుతాయా..? అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు వేసి అర్హులను గుర్తించేందుకు ప్రభుత్వం ఇండ్ల సర్వే చేపట్టింది. కానీ నిరుపేదలు ఎక్కడ ఉన్నారో కానీ సొంతిళ్లు ఉన్నవారు, రాజకీయ నాయకులు ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న విషయం సర్వేలో వెలుగు చూస్తుండడం విశేషం. ఒకవైపు ఇందిరమ్మ ఇండ్ల సర్వే జరుగుతుండగానే మరోవైపు చోటామోటా నాయకులు ఇండ్ల కోసం పైరవీలను మొదలెట్టారు. అధికారులు ఇందిరమ్మ ఇండ్ల యాప్ ద్వారా అప్లికేషన్‌దారుల వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. అయితే ఒక్కో ఇంటికి 15 నుంచి 20 నిమిషాల సమ యం పడుతున్నది. దరఖాస్తుదారుడి పేరు, ఆధార్ ఐడీ, ఏడాది ఆదాయం, సొంత స్థలం ఉందా..? గతంలో ఇల్లు మంజూరైందా..? ఇలా పలు ప్రశ్నలను సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నారు. యాప్‌లో ఏఐ టెక్నాలజీ ఉపయోగించి దరఖాస్తుదారుడి ముఖాన్ని, ఇల్లు నిర్మించుకునే వివరాలను నమోదు చేస్తున్నారు. కాగా జిల్లాలో ఇప్పటివరకు 96శాతం సర్వే పూర్తైనట్లు అధికారులు చెబుతున్నారు.

### జిల్లాలో 96 శాతం సర్వే పూర్తి

జిల్లాలో 96 శాతం ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తైంది. ప్రజాపాలనలో 21 మండలాలు, 16 మున్సిపాలిటీల నుంచి 3,75,013 ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులు రాగా ఇప్పటివరకు 3,60,000 ఇండ్ల సర్వే పూర్తైంది. మిగతా నాలుగు శాతంలో కొంతమంది అందుబాటులో లేకపోవడం, మరికొంతమంది చనిపోయిన వాళ్ల పేర్లు ఉన్నాయి. వారి వివరాలను కూడా త్వరగా సేకరిస్తాం.

-చాప్లానాయక్, గృహనిర్మాణశాఖ పీడీ, రంగారెడ్డిజిల్లా

### జిల్లాలో వచ్చిన దరఖాస్తులు 3,75,013

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకాన్ని రద్దు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని తీసుకొచ్చింది. ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించగా జిల్లాలోని చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, ఆమనగల్లు, మహేశ్వరం, రాజేంద్రనగర్ నియోజవర్గాల పరిధిలోని 21 మండలాలు, 16 మున్సిపాలిటీల్లో ఇండ్లు లేని దరఖాస్తుదారుల నుంచి మొత్తం 3,75,013 అప్లికేషన్లు వచ్చాయి. ఇందులో అర్హులను గుర్తించేందుకు ప్రభుత్వం సర్వేను చేపట్టగా ఇప్పటివరకు 96(3,60,000) శాతం పూర్తైంది. మిగతా నాలుగు శాతంలో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, కొంతమంది చనిపోయిన వారి పేర్లు కూడా ఉండడంతో అలాంటి వారి వివరాలనూ సిబ్బంది సేకరిస్తున్నారు.

ఆహారం నాణ్యతగా లేదంటూ ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు గురువారం రోడ్డుపై ఆందోళనకు దిగారు. మానేరు హాస్టల్ విద్యార్థులు తమ వంట గిన్నెలతో సహా ఆర్ట్స్ కళాశాల ఎదుట ఉన్న ప్రధాన రోడ్డుపై బైఠాయించి, రాస్తారోకో చేపట్టారు. - ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 9

# అడుగడుగునా అడ్డగింత..

## రోడ్డు సర్వేను అడ్డుకుంటున్న గ్రీన్‌ఫీల్డ్ ప్రతిపాదిత గ్రామాల్లోని రైతులు

- తమ గ్రామాల్లోకి రానే రావొద్దంటూ సూచన
- అధికారులు భారీ పోలీసు బలగాలతో వచ్చినా సమష్టిగా ఎదుర్కొంటున్న అన్నదాతలు

జిల్లాలోని గ్రీన్‌ఫీల్డ్ ప్రతిపాదిత గ్రామాల్లోకి రోడ్డు సర్వేకోసం వస్తున్న అధికారులను రైతులు ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. రెండోవిడత రోడ్డు సర్వే కోసం ప్రతిపాదిత గ్రామాల్లోకి అధికారులు వెళ్తే.. తమ గ్రామాల్లోకి రానే రావొద్దు అంటూ అన్నదాతలు మూకుమ్మడిగా అడ్డుకుని సర్వేను చేయనీవ్వడం లేదు. రెండోవిడతలో కందుకూరు మండలంలోని పంజాగూడ నుంచి కుర్మిద్ద, కడ్తాల్, ఆమనగల్లు మండలాల మీదుగా ఆకుతోటపల్లి వరకు సుమారు 21 కిలోమీటర్ల దూరం 330 అడుగుల రోడ్డు వెడల్పుకు 554 ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. -రంగారెడ్డి, జనవరి 9 (నమస్తే తెలంగాణ)

### ఇప్పటి వరకు సర్వేను అడ్డుకున్న గ్రామాలు

- ముద్విన్ గ్రామంలో ఈనెల 6న గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు సర్వే చేసేందుకు వెళ్లిన అధికారులను స్థానిక రైతులు అడ్డుకున్నారు. తమ గ్రామంలో సర్వే చేయొద్దని భీష్మించుకుని కూర్చోవడంతో అధికారులు వెనుతిరిగారు.
- ఈనెల 7న కడ్తాల్ మండలంలోని ఎక్వాయిపల్లిలో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు సర్వేకు అధికారులు వెళ్లగా.. ఈ విషయం తెలుసుకున్న భూములు కోల్పోతున్న రైతులు.. గ్రామస్తులు, రాజకీయ పార్టీల నాయకులతో కలిసి సర్వేను అడ్డుకున్నారు. అధికారులు రైతులకు ఎంత నచ్చజెప్పినా వినిపించుకోకపోవడంతో ఆఫీసర్లు వెనుతిరిగారు.
- ఈనెల 8న ఆమనగల్లు మండలంలోని సాకిబండాతండాలో రోడ్డు సర్వే కోసం అధికారులు వస్తున్నట్లు సమాచారం అందుకున్న బాధిత రైతులు వివిధ పార్టీలకు చెందిన నాయకులతో కలిసి సర్వే చేయాలనుకున్న పంట పొలాల్లో బైఠాయించారు. ఎట్టి పరిస్థితుల్లో సర్వే చేయనివ్వమని.. తమను చంపి.. తమ మృత దేహాలపై సర్వే చేసుకోవాలని తేగేసి చెప్పడంతో అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు.
- అలాగే, ఈనెల 9( గురువారం)వ తేదీ యాచారం మండలంలోని కుర్మిద్ద అనుబంధ గ్రామమైన మంగలిగడ్డతండాలో అధికారులు సర్వే చేసేందుకు వెళ్లగా తండావాసులు అడ్డుకున్నాయి. ఇప్పటికే తమ గ్రామంలో ఫార్మాసిటీ కోసం అసైన్డ్‌భూములను తీసుకున్నారని, పట్టా భూములనూ బలవంతంగా తీసుకునే ప్రయత్నంలో వాటిని నిషేధిత జాబితాలో చేర్చి తమకు రైతుబంధు, పంట రుణాలు రాకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక తమ వద్ద ఉన్న ఎకరం, అర ఎకరం భూమిని రోడ్డు కోసం తీసుకుంటే ఎలా బతకాలని ప్రశ్నించారు. ఒక్క గ్రామంలోనే మూడు విడతలుగా భూసేకరణ చేయటమేమిటని మండిపడ్డారు. ఆర్డీవో అనంతరెడ్డి, పోలీసులు నచ్చజెప్పినా వారు వినిపించుకోకపోవడంతో చేసేదేమీలేక అధికారులు వెనుతిరిగారు.

### నిర్బంధాన్ని లెక్కచేయని రైతులు..

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు సర్వే కోసం అధికారులు గ్రామాల్లోకి భారీ పోలీసు బలగాలతో వెళ్తున్నారు. అయినా రైతులంతా సమష్టిగా ఉండి పోలీసులను అడ్డుకుని సర్వేను ముందుకు సాగనివ్వడం లేదు. సర్వేను అడ్డుకుంటే కేసులు కూడా పెడతామని పోలీసులు బెదిరిస్తున్నా వారు లెక్క చేయడం లేదు. రైతులంతా సమష్టిగా ఉండి సర్వేను అడ్డుకుంటుండడంతో అధికారులు లగచర్ల ఘటనను దృష్టిలో ఉంచుకుని వెను తిరుగుతున్నారు.



## పౌరులకు ఇబ్బంది కలిగించొద్దు

- పతంగులు ఎగురవేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి
- నగర సీపీ ఆనంద్

సిటీబ్యూరో, జనవరి 9 (నమస్తే తెలంగాణ): పతంగులు ఎగుర వేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, పౌరుల ప్రశాంతతకు భంగం కలిగించొద్దని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో (పబ్లిక్ ప్లేస్) లౌడ్‌స్పీకర్లు, డీజేలు పోలీసుల అనుమతి లేకుండా వినియోగించొద్దని, ఈ మేరకు 13వ ఉదయం 6 నుంచి 15వ తేదీ ఉదయం 6 గంటల వరకు నిషేధాజ్ఞలను విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శబ్ద కాలుష్య నివారణకు ఆయా ఏరియాల్లో శబ్దాలకు సంబంధించిన పరిమితులున్నాయని ఆయన చెప్పారు.

# నిలిచిన భూ రిజిస్ట్రేషన్లు

- సర్వర్‌లో సమస్య
- గత వారం రోజులుగా ఇదే తీరు
- ఇబ్బందుల్లో క్రయవిక్రయదారులు

మాడ్గుల, జనవరి 9 : వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల కోసం మాడ్గుల తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన క్రయవిక్రయదారులు సర్వర్ సమస్యతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ధరణి పోర్టల్‌లో స్లాట్ బుక్ చేసుకుని ప్రభుత్వానికి చలాన్ల రూపంలో లక్షలాది రూపాయలు చెల్లించి.. రిజిస్ట్రేషన్ల కోసం వస్తే సర్వర్ సమస్య ఉన్నదని సిబ్బంది చెప్పడంతో క్రయవిక్రయదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజులుగా ఇదే తంతు జరుగుతుండడంతో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి సాయంత్రం వరకు వేచి చూచి రిజిస్ట్రేషన్లు జరుగక పోవడంతో ఇంటి బాట పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత మూడు రోజులుగా దాదాపు 25 రిజిస్ట్రేషన్లు నిలిచిపోయినట్లు సమాచారం.

### వారం రోజులుగా తిరుగుతున్నా..

గత బీఆర్ఎస్ పాలనలో ఇలాంటి సమస్యలు ఎప్పుడూ రాలేదు. రేవంత్ సర్కారు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సక్రమంగా రిజిస్ట్రేషన్లు ఆయిన దాఖలాలు లేవు. కాంగ్రెస్ పాలనలో కరెంట్ ఉంటే సర్వర్ రాదు. సర్వర్ ఉంటే కరెంట్ రాదు. గత వారం రోజులుగా తహసీల్దార్ కార్యాలయానికి ఉదయం 10 గంటలకు వచ్చి సాయంత్రం వరకు వేచి చూచి మళ్లీ ఇంటికి వెళ్తున్నా. ఈ సమస్యపై ప్రభుత్వం దృష్టి సారించి త్వరగా పరిష్కరించాలి.

– పాపయ్యగౌడ్, నల్లచెరువు గ్రామం

### సర్వర్‌లో సమస్య ఉంటే స్లాట్‌లూ బుక్ కావొద్దు

ధరణి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ అయి ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించిన తర్వాత రిజిస్ట్రేషన్ కోసం తహసీల్దార్ కార్యాలయానికి వస్తే సర్వర్ లో సమస్య ఉందని సిబ్బంది చెప్పడం సమంజసం కాదు. రిజిస్ట్రేషన్‌లో ఏమైనా సమస్యలు ఉంటే స్లాట్‌లూ బుక్ కాకుండా చూడాలి.

-చక్రూనాయక్, గుడితండా

### సమాచారం ఇవ్వాలి..

రిజిస్ట్రేషన్ కోసం రెండు రోజులుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. ప్రతిరోజూ ఉదయం 10 గంటలకు వచ్చి తిండి తిప్పలు లేకుండా సాయంత్రం వరకు పడిగాపులు కాస్తున్నా. సర్వర్‌లో ఏదైనా సమస్య ఉంటే అధికారులు ముందుగా రిజిస్ట్రేషన్‌దారులకు సమాచారం ఇవ్వాలి.

-మాడుగుల మహేశ్, మాడ్గుల గ్రామం

జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్టర్లు

# బిల్లులు రాకుంటే బతికేదెట్లా..?

## బల్దియాలో కాంట్రాక్టర్ల మెరుపు ధర్నా

- రూ.1500 కోట్ల బకాయిలు చెల్లించాలంటూ ఆందోళన
- ఇద్దరు కాంట్రాక్టర్ల ఆత్మహత్యాయత్నం
- ఆందోళన ఉధృతితో స్పందించిన కమిషనర్
- చర్చల అనంతరం వచ్చే జూన్ నాటికల్లా రూ. 400 కోట్లు ఇస్తామని హామీ

సిటీబ్యూరో, జనవరి 9 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ ఎదుట బల్దియా కాంట్రాక్టర్లు మెరుపు ధర్నాకు దిగారు. గురువారం కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద కాంట్రాక్టర్లంతా బైఠాయించి రూ. 1500 కోట్ల పెండింగ్ బకాయిలు చెల్లించాలంటూ నిరసన ప్రదర్శన చేపట్టారు. 'వీ వాంట్ పేమెంట్స్' అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఎవరినీ కష్టపెట్టడం మా ఉద్దేశం కాదు.. బ్యాంకుల నుంచి రుణాలు తెచ్చి, చేసిన పనులకు బిల్లులు రాక ఆర్థిక సుడిగుండంలో చిక్కుకుని బతకలేని పరిస్థితిలో ఉన్నామంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇద్దరు కాంట్రాక్టర్లు ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అక్కడే ఉన్న సహచర కాంట్రాక్టర్లు ఆ ఇద్దరి ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. బిల్లులు చెల్లించకపోవడంతో అప్పుల బాధతో కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని బల్దియా కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రామకృష్ణా రెడ్డి, సురేందర్ సింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల చదువులకు డబ్బులు లేక, వర్కర్లకు ఈపీఎఫ్, బ్యాంకులకు ఈఎంఐలు కట్టలేకపోతున్నామని, ఆర్థిక బాధలతో సడెన్ స్ట్రోక్‌లకు గురై ప్రాణాలు పోతున్న పరిస్థితులు ఉన్నాయని వాపోయారు. తమ బకాయిలు చెల్లిస్తేనే పనులు జరుపుతామని, రానున్న రోజుల్లో నిరసనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్న జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

### కమిషనర్ హామీతో..

బల్దియా కాంట్రాక్టర్ల ఆందోళనపై కమిషనర్ ఇలంబర్తి స్పందించి వారితో చర్చలు జరిపారు. కాంట్రాక్టర్లు ఎదుర్కొన్న సమస్యలపై ప్రతినిధులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఏడాది కాలంగా బకాయిలు చెల్లించడం లేదని, రూ.1500 కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ వచ్చే జూన్ నాటికల్లా రూ. 400 కోట్ల మేర బకాయిలు చెల్లిస్తామని కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. దీంతో కాంట్రాక్టర్లు ఆందోళన విరమించారు.

# నిధులిస్తేనే మెట్రోకు కొత్త కోచ్‌లు

సిటీబ్యూరో, జనవరి 9 (నమస్తే తెలంగాణ) : నిత్యం రద్దీగా ఉండే మెట్రోకు ప్రభుత్వం నిధులిస్తే గానీ కొత్త కోచ్‌లు వచ్చే పరిస్థితి లేదు. తాజాగా కొత్త కోచ్‌లను ఏర్పాటు చేయాలని ప్రయాణికుల నుంచి వస్తున్న డిమాండ్ల నేపథ్యంలో..బోగీలను తీసుకొచ్చేందుకు అవసరమైన ఆర్థిక సహకారం అందించాలని ఎల్అండ్‌టీ సంస్థ ప్రభుత్వాన్ని కోరుతున్నది. నిత్యం ట్రాఫిక్ రద్దీ ఉండే మార్గాల్లో కొత్త కోచ్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసిన నేపథ్యంలో.. ప్రస్తుతం ఉన్న ఆర్థిక పరిస్థితుల్లో ప్రభుత్వం సహకరిస్తేనే కొనేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

### ప్రస్తుతం 1075 ట్రిప్పులు..

ప్రస్తుతం 1075 ట్రిప్పుల ద్వారా రవాణా సదుపాయాన్ని అందిస్తున్న మెట్రో..చాలీచాలనీ బోగీలతోనే గడిచిన ఐదారేండ్లుగా నెట్టుకొస్తున్నది. ముఖ్యంగా పీక్ అవర్స్‌లో ప్రయాణికులతో కిక్కిరిపోతున్నా... అవే మూడు బోగీలతోనే లాక్కొస్తున్నది. కనీసం రద్దీ ఎక్కువగా ఉండే సమయంలోనైనా అదనపు బోగీలను ఏర్పాటు చేయకపోవడంతో మెట్రో ప్రయాణికులు తోపులాట మధ్యే రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం రద్దీగా నాగోల్ – రాయదుర్గం మార్గంలోనైతే... మూడు సర్వీసులు వచ్చిన కూడా ప్లాట్‌ఫారాల మీద ఉండే రద్దీ మాత్రం తగ్గడం లేదు.

### కొత్త కోచ్‌లకు టైం కావాలే...

ప్రస్తుతం ఉన్న కోచ్‌లతో నిత్యం 5 లక్షల మందిని మెట్రో సంస్థ గమ్యస్థానాలకు చేర్చుతున్నది. అయితే టైం ఫ్రీక్వెన్సీని సర్దుబాటు చేయగలిగితే... ప్రయాణికుల సంఖ్యను 7 లక్షలకు పెంచే వీలుందని సమాచారం. అయితే 10లక్షల మంది ప్రయాణించేందుకు కచ్చితంగా మరో 10 కోచ్‌లు ఉంటే గానీ సాధ్యం కాదని తెలిసింది. కొత్త మార్గాల్లో కొత్త ట్రైన్లతో పది లక్షల ప్రయాణికుల మార్కును దాటే అవకాశం ఉందన్నారు. దీంతోపాటు ప్రస్తుతం ఉన్న రైడర్ షిప్ కూడా పూర్తి సామర్థ్యానికి కంటే 10శాతమే తక్కువ ఉందని మెట్రో వర్గాలు చెబుతున్నాయి.

కొత్త కోచ్‌ల డిజైన్లు ఖరారు చేసేందుకు ఆరు నెలల పడుతుందని, మరో ఏడాదిన్నర తర్వాతనే కొత్త ట్రైన్లు అందుబాటులోకి వస్తాయని అప్పటివరకు పాత విధానంలోనే ప్రయాణికులకు సేవలు అందిస్తామని మెట్రో వర్గాలు చెబుతున్నాయి.

### ప్రతిపాదనలు సిద్ధం..

మూడు బోగీలు ఉండే 10 కొత్త ట్రైన్లను కొనుగోలు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు, ఇప్పటికే సంబంధిత ఉత్పత్తి సంస్థలను గుర్తించి సంప్రదింపులు జరిపినట్లుగా తెలిసింది. ప్రస్తుతం 57 హ్యుందాయ్ రోటెమ్ త్రీ కోచ్‌లతో కూడిన రైళ్ల ఉత్పత్తి తగ్గిపోవడంతో కొత్త డిజైన్ల ఎంపికపై దృష్టి పెట్టారు. అయితే ఇందుకు పుణె, నాగ్‌పూర్ మెట్రో సంస్థలను ఆశ్రయించారు. ఆయా సంస్థల వద్ద చాలినన్నీ అదనపు కోచ్‌లు లేవని తెలిసింది. ఈ క్రమంలోనే కొత్త డిజైన్లతో కూడిన ట్రైన్లను తీసుకు వచ్చే ప్రతిపాదనలు ఉన్నా... ఎల్ అండ్ టీ వద్ద ఉన్న ఆర్థిక పరమైన అంశాలతో వెనుకడుగు వేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ప్రభుత్వం సహకరిస్తే.... 10 ట్రైన్లను తీసుకొస్తామంటున్నారు.